# తపోభంగం

## -శ్రీకారం రామ్మోహన్

మధ్యాహ్నం భోజనం తర్వాత తీరుబడిగా కునుకు తీస్తుండగా గోపాలం నుంచి ఫోను వచ్చింది.

''నువ్వింట్లోనే ఉన్నావా? నేను ఇప్పుడే బయల్దేరి వస్తున్నా. చాలా ముఖ్యమైన విషయం'' అన్నాడు ఆదుర్దాగా.

''వేణు ఆచూకీ ఏమైనా తెలిసిందా?'' అని అడిగాను.

''అదే...పది నిముషాల్లో అక్కడుంటాను. అన్నీ వివరంగా చెబుతా'' అన్నాడు.

గోపాలం నా చిన్ననాటి మిత్రుడు. లక్షలు గడించాడు. సిరి సంపదలకు కొదవలేదు. ఒక్కగానొక్క కొడుకు గురించే బెంగ. చాలా ఆలస్యంగా కలిగిన ఏకైక సంతానం వేణు. పిల్లలకోసం గోపాలం దంపతులిద్దరూ తిరగని పుణ్యక్షేత్రం లేదు. చూడని డాక్టరు లేడు. అలా పెళ్ళైన పదిహేనేళ్ళవరకు తిప్పలు పడ్డారు. పిల్లలు ఎందుకు కలగటం లేదో ఏ వైద్య పరీక్షలోనూ ఇదమిద్ధంగా తేలలేదు. ఆ తర్వాత అన్ని ఆశలు వదులుకున్నాక అందరినీ ఆశ్చర్యపరిచేట్టు వేణు పుట్టాడు. ఆ తర్వాత కూడా వేణు ఎప్పటికపుడు అందరినీ ఆశ్చర్యపరుస్తూనే ఉన్నాడు. ఎప్పుడేం చేస్తాడో తెలీదు. ఇంట్లో అతి గారాబం. అడిగినదేదీ కాదనకుండా ఇచ్చారు. కాని అతనికి ఎందులోనూ శ్రద్ధ లేదు. చిన్నప్పుడు నాలుగురోజులు బడికెడితే మూడురోజులు మానేసేవాడు. కాని వాడి తెలివితేటలు మాత్రం అమోఘం. పరీక్షల్లో ఫస్టొచ్చేవాడు. కాకపోతే మనిషికి చపలచిత్తం. ఇంటర్‌లో డిస్టింక్షన్ తెచ్చుకున్న వేణు తేలిగ్గా ఇంజనీరింగ్‌లో సీటు తెచ్చుకున్నాడు. ఇంజనీరింగ్‌లో చేర్పించి ఊపిరి పీల్చుకున్నాడు గోపాలం. కాని కాలేజీలో కూడా ఎప్పుడూ ఏదో గొడవలే. రెండేళ్ళు గడిచాయో లేదో తనకు ఇంజనీరింగ్ ఇష్టం లేదని మధ్యలో మానేసి ఇంక చదవనని మొండికేశాడు. వ్యాపారం పెడతానని వాళ్ళ నాన్నని వేధించి రెండు లక్షలు తీసుకున్నాడు. ఆరునెలలు తిరిగేసరికి వ్యాపారం మూతపడటమేకాక ఊరి నిండా అప్పులు మిగిలాయి. దాని గురించి గోపాలం కేకలేశాడని ఓరోజు అలిగి ఇల్లొదిలి వెళ్ళిపోయాడు. మూడునెలలుగా వాడి జాడ తెలియదు. దాంతో గోపాలం దంపతులు దిగులుతో దిక్కు తోచకుండా ఉన్నారు. అప్పువాళ్ళ వేధింపులు మరోవైపు. కొంత ఆస్తి అమ్మేసి అప్పుల బాధ వదుల్చుకున్నారు. వేణు ఆచూకీ కోసం ప్రకటనలు వేశారు. ఎన్నో ప్రయత్నాలు చేశారు. కానీ ఫలితం శూన్యం.

బెల్ మోగటంతో గోపాలం వచ్చుంటాడని వెళ్ళి తలుపు తీశాను. గోపాలం కళ్ళల్లో ఒక కొత్త మెరుపు కనిపించింది. చిరునవ్వుతో లోపలికి వచ్చాడు.

''నీకు హిందీ చదవటం వచ్చుగా?'' అన్నాడు ఆత్రంగా.

''ఢిల్లీలో పదిహేనేళ్ళు సర్వీసు చేశాను. హిందీ రాకేం?'' అన్నాను.

''ఇదిగో ఇది చూడు. ఏదో వేణు ఆచూకీ గురించే ఉంది. నాకు పూర్తిగా అర్థం కాలేదు'' అంటూ జేబులోంచి ఓ కవరు తీశాడు.

ఉత్తరం అందుకుని చదివాను. రిషికేశ్ దగ్గర ఏదో స్వామీజీ ఆశ్రమం నుంచి వచ్చింది. వేణు వాళ్ళ ఆశ్రమంలోనే కొంతకాలంగా ఉంటున్నాడుట. తనకు సన్యాసం ఇప్పించమని బతిమాలుతున్నాడుట. తల్లిదండ్రులు అనుజ్ఞ తీసుకువస్తే తప్ప సన్యాసం స్వీకరించేందుకు వీల్లేదని ఎంత చెప్పినా వినకుండా వేధిస్తున్నాడట. చివరికి ఒకరోజు అతని పెట్టె రహస్యంగా వెతికితే ఈ అడ్రసు దొరికిందని, వెంటనే ఈ లేఖ వ్రాస్తున్నామని స్వామీజీ రాశారు. సారాంశం గోపాలానికి వివరించారు.

''వాడికిదేం బుద్ధి...అంత గారాబంగా పెంచితే సన్నాసుల్లో కలవడం ఏమిటి?'' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

నువ్వేం దిగులుపడకు. మనం రేపే బయలుదేరి వెళ్ళి నచ్చజెప్పి తీసుకొద్దాం అంటూ భుజం తట్టాను.

★★★

''మీరేమీ కంగారుపడకండి. అతనికి సన్యాసి కావాలనే కోరిక చాలా బలంగా ఉంది. అందుకని మేము కాషాయ వస్త్రాలు ఇచ్చి నువ్వు ఇప్పుడు సన్యాసివే అని నమ్మించాం. మానసికంగా బాగా దెబ్బతిని ఉన్నాడు. క్రమంగా కోలుకుంటాడు. మీరు నెమ్మదిగా నచ్చచెప్పాలి. కొంతకాలం కాషాయ వస్త్రాలు ధరించినా మీరు వద్దనకండి. నలుగురిలో పడితే మళ్ళీ మామూలు మనిషి అవుతాడు'' అని చెప్పారు స్వామీజీ మాతో.

ఆ ప్రశాంతమైన ఆశ్రమ వాతావరణం చూస్తుంటే నిజానికి మాక్కూడా సన్యాసం తీసుకోవాలనిపించింది.

''ఇప్పుడు మా అబ్బాయి ఎక్కడున్నాడు?'' అడిగాడు గోపాలం ఆదుర్దాగా.

''పిలిపిస్తాను'' అన్నారు స్వామీజీ. వేణుని తీసుకురమ్మని ఒక శిష్య పరమాణువుని పురమాయించారు.

కాసేపటికి శిష్యులు వేణుని తోడ్కొని వచ్చాడు. వేణు గుర్తుపట్టటానికి వీల్లేకుండా ఉన్నాడు. కాషాయాంబరాలు పెరిగిన గడ్డం. మాసిపోయిన జలపాల బొట్టు. గుంటలోపడ్డ కళ్ళు. మేము అక్కడ ఉంటామని ఊహించని వేణు మమ్మల్ని చూడగానే గతుక్కుమన్నాడు. వెనక్కి తిరిగి పోబోయాడు. అది గమనించిన స్వామీజీ ''వేణూ ఇలారా'' అని పిలిచారు అధికార స్వరంతో. వేణు పిల్లిలా వచ్చి కూర్చున్నాడు.

''మీ ఊరు నుంచి మీ తండ్రిగారు వచ్చారు. నిన్ను తీసుకువెళ్ళటానికి. నీవు సన్యాసం పుచ్చుకున్నంత మాత్రాన ఆశ్రమంలోనే ఉండాలని లేదు. నీవు మీ ఇంటికి వెళ్ళి ధ్యానం చేసుకో. నీకు మీ ఇంట్లో నచ్చకపోతే తిరిగి మావద్దకు రావచ్చు. కాని మా సందేశాన్ని మీ రాష్ట్రంలో వ్యాప్తిచేసేందుకు నీవు మీ ఊరు వెళ్ళాలని కోరుకుంటున్నాను. సరేనా'' అన్నారు స్వామీజీ. ఈ మాటలంటున్నపుడు ఆయన గొంతులో మార్దవం, అధికారం, లాలన తొణికిసలాడాయి. వేణు తల పంకించాడు.

''సరే నీవు వెళ్ళచ్చు'' వేణుని పంపించేశారు.

''మీరు అతన్ని నెమ్మదిగా మార్చుకోవాలి. చాకచక్యంతో వ్యవహరించాలి'' అని మరోసారి మమ్మల్ని హెచ్చరించారు స్వామీజీ. గోపాలం స్వామీజీ పాదాలను కళ్ళకద్దుకున్నాడు. తన కొడుకుని తిరిగి అప్పగించినందుకు అతని కళ్ళు కృతజ్ఞతతో నిండిపోయాయి.

తిరుగు ప్రయాణంలో వేణు మాతో ఒక్కముక్క కూడా మాటాడలేదు. రుద్రాక్షమాల తిప్పుకుంటూ ఏవో మంత్రాలు చదువుకుంటూ మేమెవరమో తెలీనట్లు వ్యవహరించాడు. పెట్టింది తినేవాడు. వేణు సన్యాసానికి కారణం నిజమైన వైరాగ్యమో లేక ఆధ్యాత్మికత మీద హఠాత్తుగా ఆసక్తి కలిగిందా లేదా వ్యాపారంలో చేసిన అప్పుల బాధ నుంచి తప్పించుకునేందుకు ఈ మార్గం ఎన్నుకున్నాడా అన్నది నాకు అర్థం కాలేదు. అతని చిత్త చాంచల్యం తెలిసిందే. కాని తాను మనసు పడినంత కాలం ఆ విషయం మీద చాలా ఏకాగ్రత చూపుతాడు. పూర్తిగా అంకితమైపోతాడు. ప్రస్తుతం తాను సన్యాసినన్న నమ్మకంతో పూర్తిగా భౌతిక ప్రపంచాన్ని పట్టించుకోనట్టుగా ఉన్నాడు.

వేణుని ఇంటికి తీసుకురాగానే వాళ్ళమ్మ పెద్దపెట్టున శోకాలు మొదలుపెట్టింది. వేణుని వాడి గదిలో కూర్చోబెట్టి ఆవిడని పక్కకు తీసుకువెళ్ళాం. ఇది శోకాలతో తీరే సమస్య కాదని, తెలివిగా పరిష్కరించాల్సిన వ్యవహారమని చెప్పాము.

ఆ మర్నాడు మేం ముగ్గురం సమావేశమై వేణుని తిరిగి 'జాతీయ జీవన స్రవంతి'లోకి తీసుకురావడానికి పథకాలు ఆలోచించసాగాం.

''తపోభంగానికి మన పురాణాల్లోనే బోలెడు మార్గాలు చూపించారు. ఇంద్రుడి రూట్‌లో వెడితే వేణు వైరాగ్యం వెర్రి



కొన్నివారాల్లో కుదురుతుంది. అని గోపాలం దంపతులకు హామీ ఇచ్చాను. చివరకు దశలవారీగా ఒక కార్యక్రమం ఆచరణలో పెట్టాలని నిర్ణయించుకున్నాం. నాకిదంతా సరదగానే ఉంది. వాళ్ళకి పాపం దిగులుగా ఉంది.

వేణు గదిలోనే ఒక పూజామందిరం ఏర్పాటుచేసి గోడల నిండా దేవుళ్ళ పటాలు పెట్టాం. నిరాటంకంగా అతను పూజలు చేసుకోటానికి ఏర్పాట్లు చేశాం. ఇవన్నీ చూసి వేణు సంతోషించినట్టే కనిపించాడు. అతని సన్యాసానికి ఎట్టి అవాంతరం లేదన్నట్టు నమ్మకం కలిగించాము.

''ఈ మంచం తీసేయండి. నేను కిందే పడుకుంటాను'' అన్నాడు వేణు మెల్లిగా.

''మంచం మార్చేందుకు చోటులేదు కాబట్టి ఉండనీ. కింద పడుకోవాలనిపిస్తే పడుకో. అయినా సన్యాసులు మంచం మీద కూడా పడుకోవచ్చు. కదండీ అన్నయ్యగారూ...'' అంది గోపాలం వాళ్ళావిడ నా సమర్థన కోరుతూ.

''నిక్షేపంలా పడుకోవచ్చు. సన్యాసులు మంచం మీద పడుకోకూడదని ఏ శాస్త్రంలోను లేదు'' అన్నాన్నేను.

''ఔనౌను. మంచం మీద పడుకోటానికి అభ్యంతరం లేదని స్వామీజీ కూడా చెప్పారు'' అన్నాడు గోపాలం.

మెల్లిగా ముగ్గురం ఆ గదిలోంచి జారుకున్నాం.

మూడురోజుల తర్వాత గోపాలం ఫోను చేశాడు.

వేణు రెండురోజులు కింద పడుకున్నాడని, మూడోరోజు చూస్తే మంచం మీద పడుకున్నాడని సంబరంగా చెప్పాడు. ఇంకా పూజలు, కాషాయ వస్త్రాలు మాత్రం వదలటం లేదని, భోజనం గదిలో పెడితే ఎప్పుడో ఒకప్పుడు కాస్త తింటున్నాడని చెప్పాడు.

మర్నాడు నేను వాళ్ళింటికి వెళ్ళినప్పుడు మా త్రిసభ్య సంఘం మళ్ళీ సమావేశమైంది. ఈసారి వేణు స్నానం చేసి వచ్చేటప్పటికి కాషాయ వస్త్రాలు దాచేసి మామూలు తెల్లటి పంచెలు గదిలో పెట్టమని చెప్పాను. వాళ్ళలాగే చేశారు. వేణు స్నానం నుంచి వచ్చి కాషాయ వస్త్రాలు కావాలని నానా హంగామా చేశారు.

''కాషాయ వస్త్రాలు చాకలికి వేశాను. సన్యాసులు తెల్లబట్టలు కూడా కట్టుకోవచ్చు నాయనా. రంగు మారినంత మాత్రన నువ్వు సన్యాసివి కాకుండా పోవు'' అంది వాళ్ళమ్మ.

''అసలు పూర్వపు రోజుల్లో సన్యాసులు తెల్లబట్టలే కట్టుకునేవాళ్ళు'' అన్నాడు గోపాలం.

''అసలు తెలుపులో ఉన్న స్వచ్ఛత మరే రంగులోనూ లేదుకదా. గొప్ప గొప్ప సన్యాసులంతా తెల్లబట్టలే కట్టుకుంటారు. జైనమునులు చూడండి. తెలుపు తప్ప కట్టరు. తెలుపనే కాదు సన్యాసులు ఏరంగు బట్టలైనా కట్టుకోవచ్చు. వైరాగ్యమనేది మనసులో ఉంటే ఏరంగు కట్టుకున్నా ఫర్వాలేదు'' అన్నాను నేను.

వేణు మారుమాటాడకుండా అక్కడున్న తెల్లపంచె కట్టుకుని పూజలో కూర్చున్నాడు.

చాలా రోజుల తర్వాత కాషాయ రంగు కాని బట్టల్లో కొడుకుని చూసిన గోపాలం దంపతుల మొహంలో కాంతి సంతృప్తి కనిపించింది. కొన్ని జతల ప్యాంట్లు, చొక్కాలు కూడా అతని గదిలో కనిపించేట్టుగా పెట్టమని చెప్పాను. నాలుగు రోజుల తర్వాత నే వెళ్ళేసరికి ప్యాంటు, చొక్కా వేసుకుని మంచం మీద పడుకుని ''గీతా మకరందం'' చదువుకుంటూ కనిపించాడు వేణు.

గోపాలం దంపతుల్లో కొంత రిలీఫ్ కనపడినా దిగులు పూర్తిగా పోలేదు.

''ఆ గడ్డం, జులపాలు కత్తిరిస్తే తప్ప లాభం లేదు. అన్నయ్యగారు ముందు వాటిని వదిలించే మార్గం చూడండి. అసలు వాడి మొహం ఎలా ఉండేదో కన్నతల్లిని నేనే మరచిపోయాను. బోడి మొహమైనా ఫర్వాలేదు కాని ఆ బొచ్చు మొహం చూడలేకపోతున్నాం'' అంది గోపాలం భార్య.

''నిజమేరా..ప్యాంటు, షర్టు వేసుకుని ఆ గడ్డం, జుట్టుతో మరీ విచిత్రంగా ఉన్నాడు'' అన్నాడు గోపాలం.

వేణు 'వేణీ సంహారం' గురించి రెండు రోజులు తీవ్రంగా ఆలోచించాను. ఒక మెరుపులాంటి ఐడియా

తట్టింది. వెంటనే గోపాలం ఇంటికి పరిగెత్తాను.

''వెంటనే మనం వేణుకి వడుగు చేయాలి'' అన్నాను.

గట్టిగా వేణుకి వినబడేట్టు.

''ఇప్పుడు అర్జంటుగా వడుగు ఎందుకురా?'' అన్నాడు గోపాలం కంగారుగా.

నువ్వు కంగారుపడద్దని సైగచేస్తూ ''నిన్న నాకొక సందేహం వచ్చి మన బాబాగారి మఠానికి వెళ్ళానురా'' అన్నాను.

నేనేదో కొత్త సమస్య తెచ్చిపెడుతున్నానుకుని గోపాలం దంపతులు నావైపు బిత్తర చూపులు చూశారు.

''బాబాగారిని నిన్న అడిగాను. స్వామీ, వడుగు కాకుండా సన్యాస దీక్ష తీసుకోవచ్చా'' అని. ఆయన ఉపనయనం కానివాడు సన్యాసం తీసుకునేందుకు అనర్హుడు అని స్పష్టం చేశారు. మన వేణు ఇంత పట్టుదలగా సన్యాస దీక్ష అమలుపరుస్తున్నా వడుగు కానందున అంత వృధా ప్రయాస కదా అనుకున్నాను. అందుకని వెంటనే మనం వేణుకి వడుగు చేయాలి'' అన్నాను.

వేణు మా సంభాషణను శ్రద్ధగా ఆలకిస్తున్నట్టు గమనించి గోపాలం అర్థంకాక నన్ను పక్కకి తీసుకెళ్ళి ''ఇప్పుడు వడుగు లంపటం దేనికిరా?'' అన్నాడు.

''వేణు జులపాలు కత్తిరించాలంటే మరో మార్గం లేదు. వడుగు పేరుతో గుండు చేయిస్తే నాలుగు నెలల వరకూ బాధ లేదు. ఈలోగా ఈ సన్యాసం పిచ్చి వదిలించచ్చు'' అన్నాను. నా ఆలోచనకి గోపాలం చాలా సంతోషించాడు.


మర్నాడు గోపాలం ఫోను చేసి వేణు వడుగు చేసుకోటానికి ఒప్పుకున్నాడని సంతోషంగా చెప్పాడు.

వడుగు నెపంతో వేణు గడ్డం, జులపాలు తీసేయటంతో ముఖం కాస్త తేటపడింది. గోపాలం భార్య సంబరానికి అంతే లేదు. కొంతకాలం వాళ్ళ ముఖాల్లో ఆనందం కనిపించింది.

రెండు వారాల తర్వాత పరిస్థితిని సమీక్షించటం కోసం మా 'త్రిసభ్య సంఘం' మళ్ళీ సమావేశమైంది. ఇంత చేసినా వేణు వైరాగ్యం వదల్లేదని ఇంట్లో ఎవరితోనూ మాట్లాడటం లేదని, ఐహిక వాంఛల మీద బొత్తిగా ఆసక్తి చూపటం లేదని వాళ్ళు విచారంగా చెప్పారు.

''పిచ్చి సన్యాసి..రోజుకు రెండు ప్యాకెట్లు సిగిరెట్లు కాల్చేవాడు. ఆరోజుల్లో ఎంత అందంగా రింగులు రింగులుగా పొగవదిలేవాడు'' గుడ్లలో నీరు కుక్కుకుంటూ అంది గోపాలం వాళ్ళావిడ.

వేణు గది దగ్గరికి వెళ్ళి మాట్లాడుకుందామని వాళ్ళని లేపి తీసికెళ్ళాను. అతనికి వినబడేటట్లుగా పెద్దగా మాట్లాడుకుంటున్నాం. పుస్తకం చదువుతున్నట్టు నటిస్తున్న వేణు రెండు చెవులు మా మాటల మీదే ఉన్నాయని గ్రహించాను.




''అసలు సన్యాసులు పొగ తాగవచ్చా?'' సందేహం వ్యక్తం చేశాడు గోపాలం.

''నిక్షేపంగా తాగచ్చు. పెద్ద పెద్ద స్వాములు గంజాయి దమ్ము లాగుతారు. చిన్న చిన్న సన్యాసులు సిగిరెట్లు లాంటివి తాగచ్చు'' అన్నాను.

''అయితే మన వేణు కూడా సిగిరెట్లు తాగచ్చన్నమాట'' అన్నాడు గోపాలం గట్టిగా.

''మహారాజులా..మనసులో పిచ్చి పిచ్చి ఆలోచనలు కలగకుండా పరిశుద్ధంగా ఉంచుకోవటానికి సిగిరెట్లు తాగటం అవసరం కూడాను'' అన్నాను అంతకన్నా గట్టిగా.

కొన్ని సిగిరెట్ ప్యాకెట్లు వేణు గదిలో ఉంచమని రహస్యంగా చెప్పాను. గోపాలం తలూపాడు.

మరో రెండురోజులకు గోపాలం ఫోన్ చేశాడు. వేణు గదిలో సిగిరెట్ ప్యాకెట్లు ఖాళీ అయినాయని లాటరీలో మొదటి బహుమతి వచ్చినంత సంతోషంగా చెప్పాడు. నెమ్మదిగా వేణు ఇహ జగత్తులోకి వస్తున్నందుకు అందరం సంతోషించాం. కాని ఇంకా ఆ గది నుంచి బయటకు రావటం లేదు.

అతని గదిలో ఒక పోర్టబుల్ కలర్ టివి పెట్టించమని చెప్పాను. నెమ్మదిగా వేణు పూజలు తగ్గించి టి.వి చూడటంలో ఎక్కువకాలం గడపసాగాడు. మా 'త్రిసభ్య సంఘం' మళ్ళీ సమాలోచనలు జరిపి ఇప్పటివరకూ చేసిన ప్రయత్నాలు సఫలం కావటం పట్ల సంతృప్తి వ్యక్తం చేసింది. ఇదేవిధంగా ఈ ప్రయత్నాలను ముమ్మరం చేయాలని నిర్ణయించింది.

★★★

ఒకరోజు పొద్దున్నే గోపం స్వీట్ ప్యాకెట్ పుచ్చుకుని హడావిడిగా వచ్చాడు.

''ఒరేయ్..వేణు పూర్తిగా మామూలు మనిషయిపోయాడురా'' అంటూ నా నోట్లో స్వీట్ పెట్టాడు.

''ఎలా? ఏం జరిగింది?'' అడిగాను ఉత్సాహంగా.

''మా కొత్త పనిమనిషి సీతాల్ని చూశావుగా.''

''ఆ...సినిమాస్టార్లలే ఉంటుంది ఆమేనా?''

''అదే...సీతాల్ని రోజా వేణు గది శుభ్రం చేయడానికి పంపిస్తున్నాం. మొదట్లో కన్నెత్తి చూసేవాడు కాదు. మెల్లగా ఇదెళ్ళినప్పుడల్లా వాడు పూజలు మానేసి దీని వంక గుడ్లప్పగించి చూడటం గమనించాను. ఈరోజు అది గది ఊడుస్తుంటే వేణు వెనకాల్నించి వెళ్ళి వాటేసుకుని ముద్దు పెట్టుకున్నాడుట? అది కంగారుపడి ''వాలమ్మో'' అంటూ బయటికి పరిగెత్తుకొచ్చింది. ఏమిటే అంటే సంగతి చెప్పింది. మా ఆవిడ వెంటనే సంబరంతో దానిచేతిలో రెండొందలు పెట్టి ఎవరికీ చెప్పకు, వెళ్ళి చీర కొనుక్కోమంది. ఇంకా ఈ సన్యాసం పీడ వదిలిపోయినట్టేగా'' అంటూ చెప్పుకొచ్చాడు గోపాలం. చాలారోజులకు వాడి కళ్ళల్లో వెలుగు చూశాను.

''ఏమిటండి హడావిడి?'' అంటూ వంటింట్లోంచి మా ఆవిడ బయటకు వచ్చింది.

''నువ్వు కూడా తీసుకోమ్మా అంటూ'' ఆవిడ చేతిలో ఓ స్వీటు పెట్టాడు గోపాలం.

''దేనికిదంతా?'' అంది మా ఆవిడ.


''వేణు వాళ్ళ పనిమనిషిని ముద్దు పెట్టుకున్నాడుట'' అని చెప్పాను విషయం వివరిస్తున్నట్టుగా.

''ఆ..అదే. ఇంకా చాలామందికీ విషయం చెప్పాలి'' అంటూ స్వీటు ప్యాకెట్‌తో బయటకు పరిగెత్తాడు గోపాలం.

''ఇదెక్కడి విడ్డూరమండీ..వేణుకి పిచ్చి ఎలా ఎక్కిందా అని ఇన్నాళ్ళు అనుకునేదాన్ని...వాళ్ళ వంశంలోనే ఉన్నట్టుంది పేపకాయంత'' అంటూ నివ్వెరపోయింది మా ఆవిడ.

ఇనుప కచ్చడాలు కట్టుకున్న మునిపుంగవుల్ని కూడా ఇరకాటంలో పెట్టగల సీతాలు అందాల్ని తల్చుకుంటూ నేను ముసిముసి నవ్వులు నవ్వుకున్నాను.

★



## కొత్త కాంబినేషన్

ఒకప్పుడు ఎన్టీఆర్-ఎఎన్నార్ కలిసి ఓ చిత్రంలో నటించడం అంటే అదో పెద్ద క్రేజ్! ఆ తర్వాత వారి కుమారులు, చిత్ర రంగ వారసులు బాలకృష్ణ-నాగార్జునలు హీరోలుగా ప్రవేశించాక వీళ్ళిద్దరూ కూడా కలిసి నటిస్తారని ప్రేక్షకులు చాలా కాలంగా ఆశించారు. అయితే బాలకృష్ణ-నాగార్జున కలిసి నటించలేదు కానీ, ఇప్పుడు ఎన్టీఆర్ మరో తనయుడు హరికృష్ణ-నాగార్జున అన్నదమ్ములుగా నటించడం పెద్ద క్రేజ్ కూర్చుంది. నిర్మాత శివప్రసాద్ రెడ్డితో నాగార్జున కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్న 'సీతారామరాజు' చిత్రం విడుదలకు తుది మెరుగులు దిద్దుకుంటోంది. అభిరుచి గల నిర్మాతగా తనదైన ప్రత్యేకతని నిరూపించుకుంటున్న హీరో నాగార్జున-హరికృష్ణల కాంబినేషన్‌లో ఈ చిత్రం తప్పకుండా సక్సెస్ అని సినీ వాణిజ్య వర్గాల వారు అంటున్నారు.

-జె.ఎం.